కబ్జా కోరల్లో చెరువులు

- ఏటేటా పెరుగుతున్న ఆక్రమణలు
- ఇరిగేషన్ అధికారుల మొద్దు నిద్ర
- ఆందోళన చెందుతున్న రైతులు

వ్యవసాయానికి కీలకమైన చెరువులు, సాగు నీటి కాలువలు అక్రమార్కుల కబ్జా కోరల్లో చిక్కుకుంటున్నాయి. విలువైన చెరువు భూములను అక్రమించి కొన్ని రోజుల తర్వాత అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవంతో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదు చేస్తున్నా అధికారులు మొద్దు నిద్ర వీడక పోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి.



గొలగమూడి సమీపంలో రిజర్వాయర్‌లో ఆక్రమిత సాగు భూమి

వెంకటాచలం: వెంకటాచలం, ముత్తుకూరు మండలాలకు సాగు, తాగునీటికి కీలకమైన సర్వేపల్లి రిజర్వాయర్ ప్రాంతం ఆక్రమణలకు గురవుతోంది. ఈ రిజర్వాయర్ నుంచి రెండు మండలాల్లో 64 గ్రామాలకు తాగునీరు, 15,300 ఎకరాలకు అధికారకంగా అనధికారకంగా 30 వేలకు సాగునీరు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే రిజర్వాయర్ విస్తీర్ణం 15 వేల ఎకరాలు కాగా, ఏటా రిజర్వాయర్ పైభాగంలో ఆక్రమణలతో కుదించుకుపోతుంది. గత 15 ఏళ్లకుపైగా ఆక్రమణదారులు వరిసాగు చేసుకుంటున్నారు. ఆయకట్టు రైతులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. 2011 సంవత్సరంలో రిజర్వాయర్ ఆక్రమణలపై నలుగురు సర్వేయర్లతో సర్వే చేయించారు. అప్పట్లో 300 ఎకరాలకు పైగా ఆక్రమణదారులు వరి సాగు చేసినట్లు సర్వేలో తేల్చారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి వదిలేశారు. అప్పటి నుంచి మళ్లీ రిజర్వాయర్ అక్రమణల జోలికి నీటిపారుదల శాఖ, రెవెన్యూశాఖ అధికారులు వెళ్లలేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1000 నుంచి 1500 ఎకరాలకు పైగా ఆక్రమణలకు గురై ఉంటుందని రైతుల అంచనా.

ఆక్రమిత భూముల అమ్మకాలు

సర్వేపల్లి రిజర్వాయర్‌ను ఆక్రమించి సాగు చేసుకుంటున్న భూములను పలువురు అమ్మకాలు చేసుకుని సొమ్ము చేసుకున్నారు. రిజర్వాయర్ పరిధిలోని అనికేపల్లి, గొలగమూడి, కంటేపల్లి, జోసఫ్‌పేట, తదితర గ్రామాల్లో రిజర్వాయర్ భూములను కొందరు కొన్నేళ్లుగా అక్రమంగా సాగు చేసుకుంటున్నారు. ఈ భూములకు యంత్రాలతో చుట్టూ గట్లు వేయించి మోటార్ల ద్వారా రిజర్వాయర్ నీటినే ఆక్రమణంగా వాడుకుంటున్నారు. సెంటు భూమిలేని వ్యక్తులు ఎకరా రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలకు కొనుగోలు చేసి సాగు చేసుకునేందుకు ముందుకు వస్తున్నారు. కొందరు ఆక్రమిత భూములకు సాగునీటిని తరలించేందుకు రిజర్వాయర్ లోపలి నుంచి ఇష్టారాజ్యంగా కాలువలు తవ్వేస్తున్నారు.

కాకుటూరులో పంటకాలువ కబ్జా

మండలంలోని కాకుటూరు గ్రామ పరిధిలో పోతురాజు, మొగళ్ల చెరువులు ఉన్నాయి. పోతురాజు చెరువు జాతీయ రహదారి అనుకుని ఉండడంతో ఈ చెరువును కొందరు పోటాపోటీగా ఆక్రమిస్తున్నారు. పోతురాజు చెరువు, మొగళ్ల చెరువుకు సాగునీరు వెళ్లాల్సిన కాలువను సైతం ధ్వంసం చేసి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. పోతురాజు చెరువు వద్ద కాలువ ఆక్రమణల గురించి రైతులు అధికారులకు ఫిర్యాదు చేసినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల నుంచి ఫోన్లలో ఫిర్యాదులు ఎక్కువ రావడంతో ఇరిగేషన్ ఏఈ నాగజ్యోతి పోతురాజు చెరువు వద్దకు చేరుకుని పంట కాలువపై అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని ఆక్రమణదారులకు సూచించారు. వెంటనే అక్కడకు చేరుకున్న స్థానిక టీడీపీ నాయకుడు ఆమెను బెదిరించినట్లు సమాచారం. మిగతా ఆక్రమణలన్నీ తొలగిస్తే, మేము కూడా నిర్మాణాలు ఆపేస్తామని వాగ్వాదానికి దిగడంతో ఆమె అక్కడ నుంచి వెళ్లి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే ఈ వ్యవహారం జరిగి వారం రోజులు గడుస్తున్నా.. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని కాకుటూరులో పోతురాజు చెరువుతోపాటుగా పంట కాలువ ఆక్రమణలు, సర్వేపల్లి రిజర్వాయర్ ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.



పోతురాజు చెరువు వద్ద పంట కాలువ కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు

ఆక్రమణలపై చర్యలు

కాకుటూరులో పోతురాజు చెరువు, పంట కాలువ ఆక్రమణల విషయం నా దృష్టికి వచ్చింది. ఈ విషయంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చెరువు ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం.

– పాండురంగారెడ్డి, కనుపూరు కెనాల్ డీఈ

క్లుప్తంగా

ఆంజనేయస్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో ఆంజనేయస్వామి

పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్ శ్రీవీర అభయాంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకు పూజ, అభిషేకాలు, ప్రత్యేక పూజలు, తిరిగి సాయంత్రం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వేడుకగా తిరునాళ్ల ప్రారంభం

విడవలూరు: మండలంలోని ఊటుకూరు పెద్ద పాళెంలో రాములోరి తిరునాళ్ల మహోత్సవం మంగళవారం ప్రారంభమైంది. స్వామివారిని విశేషంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామకాపులు మాట్లాడారు. రాముల వారికి పట్టాభిషేకాన్ని బుధవారం నిర్వహించనున్నామని చెప్పారు. స్వామివారి ఊరేగింపు, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను గురువారం ప్రదర్శించనున్నారని వివరించారు. గ్రామ పెద్దకాపు కొండూరు చిరంజీవి, రెండో కాపు అక్కయ్యగారి నరసింహం, మూడో కాపు శ్రీహరికోట నాగభూషణం, బుచ్చింగారి పెద్దనాగూర్, సొసైటీ ప్రెసిడెంట్ మీనంగారి రాములు, సర్పంచ్ మేకల పోలయ్య, అక్కయ్యగారి రాములు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని దామరమడుగు ఉన్నత పాఠశాలలో 2006 – 07 మధ్య పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని పుచ్చలపల్లి సుందరయ్య కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించారు. నాటి స్మృతులను నెమరేసుకున్నారు. గురువులను సత్కరించారు.

విద్యుత్ సమస్యలపై తక్షణమే స్పందించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో విద్యుత్ సమస్యలపై అధికారులు, సిబ్బంది తక్షణమే స్పందించడంతో పాటు సమస్యలను తెలియజేసేందుకు గానూ ఏర్పాటు చేసిన వాట్సాప్ నంబర్ 95523 00009పై అవగాహన కల్పించాలని ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో గల స్కాడా కార్యాలయంలో ఆ శాఖ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెపై సంబంధిత సబ్‌స్టేషన్, లైన్‌మెన్ల ఫోన్ నంబర్లను ముద్రించే కార్యక్రమాన్ని నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ విద్యుత్ బిల్లుల బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వసూలు చేయాలని పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ జిల్లా నోడల్ అధికారి శేషాద్రిబాల చంద్ర, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, ఈఈలు శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి, బెనర్జీ, రమేష్ చౌదరి, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

అసైన్‌మెంట్ పట్టాలివ్వాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న రైతులు

కొడవలూరు: ఇరవై ఏళ్లకుపైగా ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటూ జీవిస్తున్న తమకు అసైన్‌మెంట్ పట్టాలివ్వాలని మండలంలోని పెయ్యల పాళెం అరుంధతీయవాడకు చెందిన రైతులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ స్ఫూర్తిరెడ్డికి వినతి పత్రాన్ని మంగళవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. అసైన్‌మెంట్ పట్టాలిచ్చి తమను ఆదుకోవాలని కోరారు. కాగా విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ



ఆహ్వానపత్రికలను ఆవిష్కరించిన సభ్యులు

పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను మంగళవారం నిర్వాహణ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ముందుగా స్వామి చెంత ఆహ్వాన పత్రికలను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తన్నీరు సుబ్రహ్మణ్యం, దాసరి శ్రీనివాసులు, చొప్పా వెంకటేశ్వర్లు, సన్నికంటి మురళీ, కృష్ణంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథునికి విశేష పూజలు



మనుబోలు: చెర్లోపల్లి రైల్వేగేటు సమీపంలో విశ్వనాథస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్రీనివాసులు వివిధ రకాల సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో విశ్వనాథునికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం విశ్వనాథునికి అన్నపూర్ణాదేవి స్వయంగా విందు భోజనం వడ్డిస్తున్న విశేష అలంకరణలో స్వామి వారిని అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విశ్వనాథుడిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గూడూరుకు చెందిన రాజేంద్ర మొదలియార్, రేణుక దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

క్విజ్ మాస్టర్‌కు సత్కారం



కొడవలూరు: కొడవలూరులోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులను వినూత్న ప్రశ్నలను ఇన్నోవేషన్ క్విజ్ మాస్టర్ యంత్రపాటి సుబ్బారావు మంగళవారం అడిగారు. ఎక్కువ సమాధానాలు చెప్పిన విద్యార్థి ఆసిఫా బేగానికి ఇన్నోవేటివ్ క్విజ్ సర్టిఫికెట్‌ను అందజేశారు. అనంతరం సుబ్బారావును గ్రంథాలయ తరఫున సత్కరించారు. లైబ్రేరియన్ రాజేశ్వరి, రిటైర్డ్ హెచ్ఎం వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండ

- ఉదయం ఏడు గంటల నుంచే భగభగలు



జన సంచారం లేక బోసిపోయిన పట్టణంలోని మెయిన్ రోడ్డు

పొదలకూరు: వేసవి భగభగలు రోజురోజుకు పెరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం పొదలకూరు సమీపంలోని రాపూరు, కలువాయిల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. అయితే పొదలకూరులో చినుకు పడలేదు. దీంతో ఎండ తీవ్రత నిప్పుల కొలిమిని తలపిస్తోంది. పట్టణం, గ్రామాల్లో ఎండ వేడిమికి ప్రజలు అల్లాడిపోతున్నారు. తీవ్ర ఉక్కపోతతో వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 7 గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. దీంతో 10 గంటలకే పట్టణంలోని వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వారం రోజులుగా 42 నుంచి 43 డిగ్రీల ఎండకాస్తోంది.

పడమటి గాలి తోడు

గ్రీష్మతాపానికి తోడు పడమటి గాలులు ప్రారంభం కావడంతో బయటకు వస్తే నిప్పుల్లో నిలబడినట్లు ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ గాలులతో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో పాటు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పడమటి గాలులు వీస్తున్నాయి.

నేత్రపర్వంగా రథోత్సవం



ఇందుకూరుపేట: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి రథోత్సవాన్ని కనులపండువగా మంగళవారం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువుదీర్చారు. ఉభయకర్తలుగా మన్రి గిరిబాబు, సురేఖ దంపతులు వ్యవహరించారు. పార్వేట, అశ్వవాహనోత్సవాన్ని రాత్రి నిర్వహించారు. ఉభయకర్తగా సంగం పెంచలయ్య వ్యవహరించారు. ఆలయ అర్చకుడు బండారు ప్రభాకర్‌శర్మ పర్యవేక్షించారు.

చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య

నెల్లూరు (పొగతోట): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని సీడీపీఓ లక్ష్మీదేవి పేర్కొన్నారు. బాలాజీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పాఠశాల సంసిద్ధత కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడారు. చిన్నారుల్లో ఆసక్తి, నైపుణ్యాల అభివృద్ధికి పాఠశాల సంసిద్ధత కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని చెప్పారు. సూపర్‌వైజర్ స్వరూప, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ అశోక్‌కుమారి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే అవకాశాన్ని వినియోగించుకోండి



మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

కోవూరు: అధికారులకు రైతులు సహకరించి భూ రీ సర్వే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. మండలంలోని వేగూరులో మంగళవారం నిర్వహించిన రీ సర్వే గ్రామసభకు ఆర్డీఓ అనూషతో కలిసి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. భూ వివాదాలను పరిష్కరించడమే కార్యక్రమ ఉద్దేశమని చెప్పారు. పాత భూ రికార్డుల్లో ఏమైనా సమస్యలుంటే వాటిని సరిచేసి నూతన పాస్‌పుస్తకాన్ని మంజూరు చేయనున్నారని వివరించారు. పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, వేగూరు సర్పంచ్ కరేటి అమరావతి, తహసీల్దార్ నిర్మలానందబాబా, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ మధు, ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి, డీటీ నాజర్, ఎంపీపీ పార్వతి, మల్లారెడ్డి, నాగిరెడ్డి శ్యామ్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన



అంగన్‌వాడీ కేంద్రంలో పోస్టర్ల ఆవిష్కరణ

కొడవలూరు: బాలల హక్కులపై మండలంలోని కొత్తవంగల్లు అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలు, తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడారు. బాలికలపై ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోక్సో లాంటి కఠిన చట్టాల ద్వారా శిక్షిస్తారని వివరించారు. గుడ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు.

➡ మండలంలోని గువ్వగుంట అంగన్‌వాడీ కేంద్రంలో బాలల హక్కులపై తల్లిదండ్రులు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ, తేజస్విని, అంగన్‌వాడీ కార్యకర్త అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన అవసరం

తోటపల్లిగూడూరు : కిశోర బాలికలకు తమ హక్కులపై అవగాహన ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. మండలంలోని నరుకూరు బీసీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర వికాసం–వేసవి శిక్షణపై సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండని బాలకలు వారి హక్కులపై అవగాహన పెంపొందించుకోవాల్సిందిగా సూచించారు. బాల్య వివాహాలతో అనేక అనర్థాలు కలుగుతాయన్నారు. సోషల్ మీడియాకు ఆకర్షితులు కాకుండా చదువుకోవాల్సిందిగా సూచించారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

మనుబోలు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. మండలంలోని కట్టువపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాలు, బాలికల హక్కులు, లైంగిక వివక్ష, బాలికా సంరక్షణ చట్టాలు, పరిసరాల పరిశుభ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, రుతుక్రమం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శిరిషా, అంగన్‌వాడీలు కల్పన, రమణమ్మ తదితరలు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

పొదలకూరు : కిశోర బాలికలకు చట్టాలపై అవగాహన ఉండాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ జ్యోతిలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని నర్సారెడ్డికాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోర వికాస్–వేసవి శిక్షణపై సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ బాల్యవివాహ చట్టంపై కిశోర బాలికలు అవగాహన పెంపొందించుకోవాల్సిందిగా సూచించారు. 18 ఏళ్ల కంటే ముందు పెళ్లిళ్లు చేయాలని ప్రయత్నిస్తే వెంటనే తమకు సమాచారం అందజేయాలన్నారు. ముందుగా అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, రత్నమ్మ, ఆశావర్కర్ ఉష, కిశోర బాలికల తల్లులు పాల్గొన్నారు.



కొత్తవంగల్లులో అవగాహన



మాట్లాడుతున్న రమణమ్మ



పోస్టర్‌తో ప్రచారం



గువ్వగుంటలో..

ప్రసన్నాంజనేయుడికి సహస్రఘటాభిషేకం

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారికి 1008 కుండలతో సహస్రఘటాభిషేకాన్ని వేడుకగా మంగళవారం నిర్వహించారు. పవిత్ర పినాకినీ నదీజలాలతో నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు విశేషంగా హాజరయ్యారు. అన్నమయ్య సంకీర్తనల గానకచేరిని గుండాల గురవయ్య ఆధ్వర్యంలో మహిళ భజన మండళ్లతో కలిసి నిర్వహించారు. ఉడుపికి చెందిన ఈషా త్రయతీర్థ ఆగమనం చేసి అనుగ్రహభాషణ చేశారు. ఉభయకర్తలుగా పైడా హేమంత్ కుమార్, కృష్ణప్రియ దంపతులు వ్యవహరించారు. ఈఓ కామేశ్వరరావు పర్యవేక్షించారు.



సహస్రఘటాభిషేకం



హాజరైన భక్తజనం



ఆశీనులైన ఈషా త్రయతీర్థ